# భూకంపం

(తలుపు చప్పుడుకి ధైర్యంగా నిలబడి యెదిరించలేని ప్రేమ, భూకంపాన్ని కెల్లా తట్టుకుంటుంది? రహస్య ప్రేమలో పరిపూర్ణత వుందని నమ్మొచ్చు. ఎందుకంటే అది మనుష్యులను జీవించేటట్లు చేయడమే కాకుండా, మరణించేటట్లు కూడా చెయ్యగలదు.)

దొంగిలించిన ముద్దులోవున్న మాధుర్యాన్ని పొగడడంలో అన్ని దేశాల కవులూ తన్మయత్నం అనుభవిస్తారు. ఆపహరించిన ప్రేమలో ఆనందం వుందని కళారాధకుల మతం. భార్య సొంత వస్తువు కాబట్టి, వివాహం నెగ్గదని కొందరు సంఘ సంస్కర్తల అభిప్రాయం. రహస్యమైన అనుభవంకోసం, మానవుడు నీతిని గాలిపటంలా గాలిలో వొదిలి దారాన్ని తెంపుతాడు. పరాయి సొమ్ముని పొందడంలో యెన్ని కష్టాలు, యెన్ని అంతరాయలూ వుంటే, విజయానికంత విలువ వుంటుంది. ఈ వేటలోని వేడి చల్లారకుండా, ప్రియులు, అనేక కారణాలు కల్పించుకుని తాత్కాలికంగా, తాము చేసిన శాశ్వతమైన ఆపరాధాన్ని సమాధానపరుచుకుంటారు.

ఈ కధలోని ఇద్దరూ, ఆ సాయంత్రం దొడ్డివైపు గదిలో కలుసుగోడం అదప్పుడే పదోసారి. వారు సంవత్సరంలో పదిసార్లు కలుసుకోడానికి కారణం కాలం వేగంగా కదలకపోవడం అనుకుని కాలాన్ని నిందించుకుంటున్నారు. ఆ కొంప పురాతనపుది, ఆ గది మరీను. ఆ గదిలోని ముసలి భోషాణం యెందరి తాతముత్తాతల ధనాన్ని దొంగల బారినుండి దాచిందో! మంచంపక్కన అమర్చబడ్డ సన్నగిలినదీపం యెప్పుడారిపోతుందా అని బోలెడు మెరుగు పురుగులు కాచుకున్నాయి. ఈ వ్యక్తులు కలుసుకున్నప్పుడు తప్ప, ఆ పురుగులు, వాటికి శత్రువైన ఆ దీపాన్ని చూడలేదు. లోపలికి వీచే, శరీరాన్ని కరిచే గాలికి, దీపం చప్పుడుచేస్తూ ప్రాణం విడుస్తోంది. ఆమె, అతను, వారి రహస్య నాటకంలోని మొదటి రంగాలని మౌనంతో నటించారు.

"ఇప్పుడు నీ మొగుడు కాడుకదా!" అన్నాడతడు.

"అప్పుడే యెక్కడొస్తారు? మొన్ననేగా వెళ్ళింది!" ఆమె.

"వాస్తే ఏంజేస్తావు?"

"రాడంటే— నాకు తెలీదేమిటి?"

"ఓవేళ వాస్తాడే అనుకో, అప్పుడేం జేస్తావు?"

"ఫరవాలేదు."

"ఓస్, కోత."

"కాదు. నాకాభయం యెప్పుడో పోయింది."

"నాదగ్గరేముందనీ. యిల్లా వాస్తావు?"

"అంతా వుంది. నువ్వు లేకపోతే నేఁబ్రతకను."

"కోత. నే అసలు పుట్టకపోతే?"

"నేనూ పుట్టను. నువ్వు నా కోసమే పుట్టావు."

"ఇది తప్పుకాదూ?" అన్నాడతను.

"తప్పేమిటి? ప్రేమ!"

"ప్రేమైతే, కలుసుకోడం యెందుకు? ప్రేమ మనస్సులో వుంచుకోరాదూ?"

"ఏమో నాకవేమీ తెలియవు. ఊరికే అంటావుకాని, నువ్విదిలేకుండా వుంటావా?"

"ఛా, నాకక్కర్లేదు."

"ఓస్, కోత."

ఇద్దరూ నవ్వుకున్నారు.

"నిజంగా వాస్తే యేమంటావు? మనం యిల్లా వుండగానే, నీ మొగుడే వొచ్చిచూస్తాడనుకో?"

"ఏమీ చెయ్యను."

"అదికాదు చెప్పు. ఏమంటావ్? "పో, పో", అంటావు నన్ను. లేకపోతే బలవంతంచేశాను నామీద తోస్తావ్ నేరం. అంతేనా?"

"ఛ ఛ, చస్తే అలా చెయ్యను. మనకి ప్రేముందంటాను. అసలు నన్ను పుట్టించిన బ్రహ్మవొచ్చిన నిన్నువదల్ను."

"అదిగో చప్పుడు" అన్నాడు పరిహాసంగా.

"లెక్కలేదు. వొదల్ను. ఇంకా గట్టిగా పట్టుకుంటాను."

మళ్లా కొంత నిశ్శబ్దం. మెరుగు పురుగులు గదిలోకి జొరబడ్డాయి.

"దీనికేం, యెప్పుడూ వున్నదే కాని, నీ మొగుడే వస్తే, మనం యిల్లావుండగా, యేమంటావు?"

"చెప్పాగా, ప్రేమంటాను. ఈ పట్టు విడిపించేందుకు యెవ్వడి తరం? నేవొదల్ను నిన్ను యెవరొచ్చినా సరే."

"ఎప్పుడూనా?"

"నే చచ్చేవరకూ. భూకంపం జరిగినా, ఇద్దరం కలిసి చావాలిసిందే."

"ప్రమాణం చెయ్యి."

"పట్టు, చేస్తా."

చేతిలో చెయ్యేసి ప్రమాణం చేసింది.

"నువ్వూ అంతే, తెలిసిందా?"

"నాకేం భయంలేదు, నేమొగాణ్ని— నామీద యెవడికీ హక్కు లేదు."

"ఓస్, కోత."

"ఛా, అల్లా అంటే నాకు కోపం వస్తుంది."

"లేదు, వూరికే అన్నా. ఆ చేతులిల్లా వెయ్యి"

"దీపం పూర్తిగా ఆరిపోయింది."

పావుగంట గడిచింది. ప్రకృతిలో జరుగుతున్న కల్లోలం, మనస్సుల్ని శరీరాలనుంచి విడదీసి జంటలో కలుపుకున్న ఆ యిద్దరు అమాయకపు వ్యక్తులూ గమనించే స్థితిలో లేరు. ఆకాశంలో గర్జనలు మారుమ్రోగి గదిలోని ముసలి ఘోషాణాన్ని వాణికించాయి. చెట్లని పెల్లగించే గాలి, కిటికీని వూడగొట్టడానికి యెన్నోవిధాలు యత్నిస్తోంది. మెరుగు పురుగులు ఆగలేక దీపాన్ని పట్టుకుని ప్రాణాలని నిలబెట్టుకుంటున్నాయి. పీధిగుమ్మం తలుపు యెవరో తట్టినట్లు చప్పుడవడం మొదట్లో ఆమె వినగలిగింది.

"ఎందుకల్లా ఖంగారుపడతావు?" అన్నాడతను.

"ఏంలేదు. ఏదో చప్పుడైనట్లుంటేనూ...."

"ఐతే ఏం?"

"అబ్బే, ఏంలేదు."

"అలుపొచ్చిందా?"

"కొంచెం, నీకు?"

"నాకులేదు. ఏదో చప్పుడు."

"నా మొగుడు కాదుకద, కొంపతీసి!" అంది.

"నాకు లెక్కలేదన్నావుగా మరి! ఇంతేనా?"

"ఉండు. ఇప్పుడేమిటి వేళాకోళం. వొదులు, ఎవరో చూసివొస్తా."

"వేళాకోళం యిప్పుడుకాక, యింకెప్పుడు?"

"భోషాణం వెనక దాక్కో, తలుపు తీసి చూసి వొస్తా." అని మంచం మీ్మంచి లేచింధి.

"ఇంతేనా ధైర్యం? ఇందాక కోతలు కోశావు!"

"అది వేరు."

"వేరేమిటి? నీక్కావలసింది జరిగిందిగా."

"ఛ. నోరుముయ్ నీకక్కర్లేనట్లు, మహా."

"నిన్ను నమ్మకూడదు." అన్నాడు.

"నిన్నును.... దాక్కో, వెళ్ళిచూసొస్తా."

"భోషాణం వెనక తేళ్ళుంటాయి."

"లేకపోతే, ఇందాకా వచ్చినట్లుగానే, నూతిగట్టుమీదనుంచి గోడ దూకు."

"నే దూకను. నాకేం? భయంగా వుంటే నువ్వే దూకు. ఇందాకా చేసిన ప్రమాణం?"

"అది వేరు. ఇది నాయిల్లు. నువ్వుదూకు."

"నీ యిల్లుకాదు. ప్రేమించినతర్వాత నాకూ యింటిమీద హక్కుంది."

"కావాలంటే కోర్టులో చెప్పుకో, ముందు దూకు, లేకపోతే ఎక్కడో దాక్కో."

"నీవన్నీ లంజటక్కులు."

"నువ్వు మహా నీతిపరుడైనట్టు!"

"నే మొగాణ్ణి. నాకేం?"

"పోతావా పోవా?...."

అని, అతన్ని మంచం మీదనుంచి గెంటింది. గెంటి, ముసలి భోషాణం మీదికి తోసి, గదిబైటకి నడచి వీధిగుమ్మంలోకి వెళ్ళింది. అప్పుడు, క్వెట్టాని నాశనంచేస్తున్న భూకంపంలోని కొంత శక్తి, ఆ గదిని వూగిసలాడించింది. ఆమె నడుస్తూ, గోడమీద పడింది. మూడువిమిషాలు ఆకొంప అదిరి వొణికిపోయింది. ముసలి భోషాణం కిందకి కూలి, విరిగి, అతన్ని దానికింద పడేసుకుని, కాపాడింది.

ఎంతోసేపటినుంచి తట్టుతున్నా తెరవబడని వీధితలుపు వూడి పడింది. బైట వేచివున్న ఆమెభర్త ఒక్క వూపున లోపలికి పడి, గోడ మీద పడిన భార్యని కలుసుకొన్నాడు.

"దెబ్బ తగల్లేదుకద?" అన్నాడు భర్త.

"లేదు, లేదు. మీకు?"

"నాకులేదు. దొడ్డివైపు కప్పు కూలినట్టుంది. చూద్దాం పద"

ఇద్దరూ వెళ్ళి గదులన్నీ పరకాయించారు. భోషాణం గదిలోకి ప్రవేశించారు. కిందనించి రక్తం కారుతోంది. మనిషి మూలుగు, రొద వినిపిస్తున్నాయి. భర్త, విరిగిన భాగాలను తొలగించి, అతన్ని బైటికి తీశాడు.

"వీడెల్లా వొచ్చాడిక్కడికి?"

"మీ బంధువే. మహానుభావుడు. వొచ్చి, నానాగొడవా చేశాడు. పర స్త్రీని బలవంతం చేసిన వెధవకి అల్లాగే అవుతుంది."

"పాపం, చావడుగద!"

"ఇట్లాంటివాళ్ళు చస్తే, పీడ వొదుల్తుంది. అందుకనే అప్పుడప్పుడు భూకంపాలు!"

ప్రచురణ-గృహలక్ష్మి 1941 జూన్.